క్లుప్తంగా

పరామర్శ

భామిని: మండలంలోని లివిరికి చెందిన కమ్మరి లక్ష్మి (38) కొద్ది రోజుల కిందట వంశధార నదిలో గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, తదితరులు శుక్రవారం పరామర్శించి, ధైర్యం చెప్పారు. లక్ష్మి జాడ తెలుసుకోవడంతో పాటు ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ఏఈ సోమేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

వీరఘట్టం: విద్యుత్ శాఖ ఏఈగా కె.సోమేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బొబ్బిలిలో డీ-2 సెక్షన్ నుంచి ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన అనిల్‌కుమార్‌కు శ్రీకాకుళం బదిలీ జరిగింది. కొత్తగా వచ్చిన ఏఈకి సహచర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

వినాయకుడి లడ్డూ వేలంపాట

భామిని: మండలంలోని సొలికిరిలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద శుక్రవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మత్స్యకార సంఘ నాయకుడు బర్ల ఆనందరావు రూ. 24 వేలకు లడ్డూ దక్కించుకున్నారు.

అలరించిన మహిళా కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

భామిని: మండలంలోని నేరడి-బి వినాయక మంటపం వద్ద వినాయక ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన బాలేరు మహిళా బృందం కోలాటం ఆకట్టుకుంది. మహిళలు లయబద్ధంగా చిడతలు వాయిస్తూ వివిధ రకాల పాటలకు నృత్యం చేశారు. అనంతరం మహిళలకు నిర్వాహకులు జ్ఞాపికలు బహూకరించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



ఐటీడీఏ పార్క్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: వాహన చోదకులు రోడ్డు నిబంధనలను విధిగా పాటించాలని గరుగుబిల్లి ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. తోటపల్లి కుడిమట్టికట్ట పరిసరాల్లోని ఐటీడీఏ పార్క్ వద్ద వాహనచోదకులకు రోడ్డు నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రయాణం ప్రమాదకరమన్నారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబ సభ్యులను గుర్తించుకోవాలన్నారు. బైక్‌లపై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది అచ్యుతరావు, సుబ్బారావు ఉన్నారు.

ప్రశాంతంగా మూడో విడత కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన మూడో విడత ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో 80 మంది దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్‌కు 72 మంది హాజరయ్యారని, వారిలో అర్హులైన 50 మందికి ప్రవేశాలు కల్పించామన్నారు.

ఆరోగ్యభద్రతకు తొలి ప్రాధాన్యం

పాలకొండ రూరల్: పలు కేసుల్లో నిందితులుగా ఉంటూ స్థానిక సబ్ జైల్‌లో ఖైదీల ఆరోగ్య భద్రతకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు జైల్ సూపరింటిండెంట్ బి.జోగులు అన్నారు. జైల్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఖైదీలు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన చర్యలపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

కురుపాం: కురుపాం మండల కేంద్రంలోని రావాడ రోడ్డు కూడలి వద్ద వాయుపుత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తామని వాయుపుత్ర సంఘ సభ్యులు తెలిపారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సభ్యులు కోరారు.

నేత్రదానంపై అవగాహన

కురుపాం: నేత్రదానంపై అవగాహన కలిస్తూ కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ సందీప్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి, వైద్యసిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. నేత్రదానానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలన్నారు.

కూరగాయల ధరలు పైపైకి..



మార్కెట్‌లో అమ్మకాలకు సిద్ధంగా కూరగాయలు

- కూరగాయల సాగుపై వర్ష ప్రభావం
- తగ్గుముఖం పట్టిన దిగుబడులు
- ఆకాశాన్నంటుతున్న ధరలు
- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు

పాలకొండ రూరల్: కొద్ది రోజుల కిందట విపరీతమైన ఎండలు.. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు.. ఈ ప్రత్యేకమైన వాతావరణం అన్ని రకాల పంటలపై పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూరగాయల రైతులు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల దిగుబడి ఘననీయంగా తగ్గింది. ఇదేక్రమంలో వరుస పండగల సీజన్ కావడం.. కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో కూరగాయల రైతులు దాదాపు 5 వేలకు పైబడి ఉన్నారు. సుమారు 11 వేల హెక్టార్లలో స్థానిక అవసరాలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా కూరగాయలను పండిస్తుంటారు. పాలకొండ మండలంలో తుమరాడ, గరుగుబిల్లి, రుద్రిపేట, అంపిలి, ఓని గ్రామాల్లో చిక్కుడు, బెండ, కాకరకాయ, టమాటా, కొత్తిమీర, కరివేపాకు, బీర, మునగ, గోంగూర, అరటి, తోటకూర, బచ్చలకూర, ముల్లంగి, తదితర పంటలు సాగు చేస్తున్నారు. వీరఘట్టం మండలంలో కూడా అత్యధికంగా కూరగాయలను సాగుచేస్తుంటారు. అలాగే భామిని,సీతంపేట ఏజెన్సీ ప్రాంతాల రైతులు కంది, కంద, జునుగులు, కొండ దబ్బకాయలు వంటివి పండిస్తున్నారు. అయితే ప్రస్తుత వాతవరణ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గిపోయింది. వర్షాలకు పంటలన్నీ నాశనమయ్యాయి. దీనికి తోడు సర్కారు నుంచి ఆశించిన సహకారం అందకపోగా బీమా ప్రీమియం కూడా రైతులే భరించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

దళారులదే పైచేయి..

ఎంతోకష్టపడి పంటలు సాగు చేస్తున్నా తమకు ఏమీ మిగలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు సిండికేట్ అవడంతో ధర పలకడం లేదని చెబుతున్నారు. కూరగాయలు, ఆకు కూరలను నిల్వ ఉంచే అవకాశం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులు అడిగిన ధరకు ఇవ్వాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇదే సమయంలో బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధరలు బాగా ఎక్కువగా ఉన్నాయి. ఓ పక్క వినియోగదారుడు ధరలు చూసి భయపడుతున్నా.. రైతుకు మాత్రం ఏమీ రావడం లేదు. మధ్యలో దళారులు బాగ సంపాదిస్తూ అటు రైతులను ఇటు వినియోగదారులను మోసం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వినియోగదారులు గగ్గోలు..

వరుస పండుగల నేపథ్యంలో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. దిగుబడి తగ్గడంతో వారం రోజుల వ్యవధిలో అన్ని రకాల కూరగాయలపై కిలోకు రూ. 15 నుంచి 25 రూపాయల వరకు ధర పెరిగింది. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

మార్కెట్‌లో ధరలు ఇలా...

కూరగాయలు	ధరలు	కూరగాయలు	ధరలు
		వంకాయలు	45
		దొండకాయలు	45
		బెండకాయలు	40
తెల్లుల్లి	రూ.80	టమాటా	50
ఉల్లి	25	బంగాళాదుంపలు	30
అల్లం	60	చిక్కుడుకాయలు	35
క్యారెట్	45	బీరకాయులు	35
మునక్కాయలు	35	బీట్‌రూట్	45
ఆగారకాయలు	120	క్యాప్సికం	90
చింతపండు	65	ముల్లంగి	85
పచ్చిమిర్చి	55	బీన్స్	55

గిట్టుబాటు కావడం లేదు..



రెండెకరాలు కౌలుకు తీసుకుని కూరగాయలు సాగు చేస్తున్నాను. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులకు దిగుబడి బాగా తగ్గింది. అధిక నీరు కారణంగా పురుగులు, క్రిమికీటకాలు ఆశించాయి. వచ్చిన దిగుబడి కనీసం పెట్టుబడికి కూడా రావడం లేదు. రైతుబజార్ లేకపోవడంతో దళారులకు అడిగి ధరకు పంట ఇవ్వాల్సి వస్తోంది.

– నెల్లి బాలు, కూరగాయల రైతు, గరుగుబిల్లి, పాలకొండ మండలం

కొనలేకపోతున్నాం..



తాజాగా పప్పు, ఉప్పు రేట్లు పెరిగాయి. వారం రోజులుగా కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రోజుకో ధర చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకూ రూ.20 లోపున్న టమాటా 50 రూపాయలకు చేరుకుంది. దిగుబడి తగ్గడంతో రైతుల నుంచి కూరగాయలు ఎక్కువగా రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయలు కొనలేకపోతున్నాం.

– బొత్స గౌరు, వినియోగదారు, పాలకొండ మండలం

నత్తల నివారణపై దృష్టి సారించాలి

- వ్యవసాయ శాఖ ఎ.డి రత్నకుమారి

పాలకొండ: నత్తల నివారణపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఎ.డి రత్నకుమారి సూచించారు. మండలంలోని సింగన్నవలసలో శుక్రవారం ఆమె పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తేమతో కూడిన వాతావరణలో నత్తల సమస్య ఉంటుందన్నారు. నత్తలు ఆకులు, కాండం, పువ్వులను తినడం ద్వారా పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని తెలిపారు. వీటి నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నత్తలు పొలంలో ఉంటే వాటిపై ఉప్పునీరు పిచికారీ చేయాలన్నారు. లేదా వెనిగర్, కాఫీ పొడిని పిచికారీ చేసినా ఫలితం ఉంటుందని చెప్పారు.

బండరాళ్ల తొలగింపు



బండరాళ్లను తొలగిస్తున్న పోలీసులు

సీతంపేట: దోనుబాయి - పొల్ల మార్గంలోని ఘాట్‌రోడ్‌లో బండరాళ్లను దోనుబాయి పోలీసులు శుక్రవారం తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండపై నుంచి రాళ్లు రోడ్డుమీద పడడంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు రాళ్లను తొలగించి, పరిస్థితిని చక్కదిద్దారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏలో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు



ఐటీడీఏలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న సిబ్బంది

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిండుకుండలా నాగావళి



గోపాలపురం సమీపంలో నిండుకుండలా ప్రవహిస్తున్న నాగావళి నది

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. మరో రెండు రోజులు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశాలున్నాయన్న అధికారుల సూచనలతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే మండల పరిధిలో చిన్నమంగళాపురం, గోపాలపురం, అంపిలి, అన్నవరం, గొట్ట మంగళాపురం, యరకరాయపురం గ్రామాలను అనుకుని ఉన్న నదీ తీరాన్ని పరిశీలించిన ఎస్సై ప్రయోగమూర్తి శుక్రవారం తన సిబ్బందితో మారోమారు తీర ప్రాంతాలను పరిశీలించి ప్రజలను చైతన్య పరిచారు. ప్రవాహం తగ్గుముఖం పట్టేవరకు తీరంలో కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం

- ఎస్పీ మాధవరెడ్డి



ఫిర్యాదుల విభాగాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

పాలకొండ రూరల్: పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరిష్కంచే క్రమంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని ఎస్పీ ఎస్‌వీ.మాధవరెడ్డి అన్నారు. పాలకొండ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై నమోదైన కేసుల పూర్వాపరాలు, నేర పరిశోధన, తదితర అంశాలను డీఎస్పీ ఎం.రాంబాబును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న వసుతులపై సీఐ మీసాల చంద్రమౌళి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాలతో పాటు దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. వినాయక నిమజ్జనాల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వివాదాలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉత్తరాంధ్రాలో ప్రఖ్యాతిగాంచిన స్థానిక కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల రవాణా, మత్తు పదార్థాలు, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. న్యాయం, రక్షణ కోసం స్టేషన్‌కు వచ్చేవారి పట్ల గౌరవభావంతో మెలగాలని సూచించారు. ఈయన వెంట ఎస్సై కె.ప్రయోగమూర్తి, సిబ్బంది ఉన్నారు.

గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు మండంగి రమణ

గుమ్మలక్ష్మీపురం: జీఓ నంబర్ 3కు ప్రత్యామ్నాయ జీఓను తక్షణమే తీసుకొచ్చి గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, గిరిజన యువజన సంఘం నాయకులు మండంగి రమణ, ఎ.గంగారావు, ఎం.సన్యాసిరావు డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. జీఓ నంబర్ 3కు ప్రత్యామ్నాయం తీసుకొస్తామని, గిరిజన నిరుద్యోగులకు శతశాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తికావస్తున్నా హామీ అమలు ఊసే లేదన్నారు. మెగా డీఎస్సీ పేరుతో ప్రభుత్వం గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరావు, వెంకటరావు, అనీల్ పాల్గొన్నారు.

పంట భూముల్లోకి వర్షపు నీరు



రాజపేట సమీప పంట భూముల్లోకి చేరిన వర్షపునీరు

పాలకొండ రూరల్: కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జల వనరుల్లో నీరు చేరుతోంది. ముఖ్యంగా పంట కాలువల్లో నీరు పుష్కలంగా ప్రవహిస్తుండడంతో రైతులు వాటిని సద్వినియోగపరుచుకుంటున్నారు. కీలకదశలో వరుణుడు కరుణించడంతో వరి సాగు చేసే రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న మేరకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు లోతట్టు పొలాలు, కొండ వాలు భూముల్లో అధిక మొత్తంలో వర్షపు నీరు చేరడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నీటిని బయటకు పంపుతున్నారు. శివారు ప్రాంతాల్లో నేటికీ చాలా పొలాలు నీటితో నిండి ఉన్నాయి.

జిల్లా కేంద్రంగా పాలకొండ

- జిల్లా సాధన సమితి డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కె. చౌదరినాయుడు

పాలకొండ రూరల్: పాలకొండను జిల్లా ద్రంగా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కె. చౌదరినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎలైట్ కళాశాల ప్రాంగణంలో సమితి సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌగోళికంగా అన్ని వనరులున్న పాలకొండ పాత రెవెన్యూ డివిజన్ పరిధిలో 14 మండలాలను కలిపి జిల్లాగా ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం 32 జిల్లాల ఏర్పాటుకు సంబంధించి ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఈ ప్రాంతంలో పర్యటించనుందని తెలిపారు. ఆ సమయంలో ఈ ప్రాంత వాసుల ఆకాంక్షను మంత్రుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోస్టుకార్డు ఉద్యమం, సోషల్ మీడియా ద్వారా మన డిమాండ్‌ను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి సభ్యులు వి. కూర్మారావు, ఎస్. నానాజీ రావు, తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న కలుపుతీత పనులు



పెదగుడబలో వరిలో కలుపుతీస్తున్న మహిళలు

గరుగుబిల్లి: ఖరీఫ్ వరి చేనులో కలుపుతీత పనులు జోరందుకున్నాయి. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి పొలాల్లో నీరు చేరడంతో కలుపుతీత పనులను రైతులు చురుగ్గా చేపడుతున్నారు. బి.వి.పురం, ఉద్దవోలు, చినగుడబ, పెదగుడబ, వల్లరగుడబ, పెద్దూరు తదితర గ్రామాల్లో గాబుతీత పనులు ఊపందుకున్నాయి.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తేనెలూరె తెలుగు భాషా మాధుర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషోధ్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కురుపాం: ప్రభుత్వ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది



భామిని: ప్రముఖుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు



భామిని: విద్యార్థినుల నృత్య ప్రదర్శన



వీరఘట్టం: గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తలవరం హైస్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు



గుమ్మలక్ష్మీపురం: తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దాక్టర్ టి.శ్రీవరం



కొమరాడ: కేజీబీవీ పాఠశాలల్లో గిడుగు వేషధారణలో చిన్నారులు



పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు, తదితరులు

ఆకుముడత తెగులుతో జాగ్రత్త



వరి పొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కురుపాం: వరిలో ఆకుముడత తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, తెగులును గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు స్రవంతి, అనంత విహారి సూచించారు. పెదమేరంగి, శివ్వాం, అడ్డాపుశిల, డి.మునగ గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. తెగులు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

అన్నసమారాధన



ఉల్లిభద్రలో అన్న సమారాధన

గరుగుబిల్లి: వినాయక చవితి సందర్భంగా ఉల్లిభద్ర రామాలయం వీధిలో గణేష్ యూత్ కమిటీ శుక్రవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.